క్లుప్తంగా

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ


మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 30న నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మెగా రక్తదాన శిబిరం వాల్ పోస్టర్‌ను మంత్రి రాజా ఆవిష్కరించారు. తుని వీరవరపుపేటకు చెందిన మహిళా పోలీస్ చింతమనేని మౌనిక జ్ఞాపకార్థం రోటరీక్లబ్ సెంట్రల్, స్పందన సేవా సంస్థలు సంయుక్తంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు రోటరీక్లబ్ అధ్యక్షుడు బి.నరసింహామూర్తి తెలిపారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, రోటరీ కార్యదర్శి చోడిశెట్టి రాజా, పొలిమేర సూర్య, స్పందన సేవా సంస్థ సభ్యులు కామేష్, శేఖర్, సాయి పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవం

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత బ్యాంకు వ్యవస్థాపకుడు సయాజీరావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ కె.భాస్కర్ కేక్ కట్ చేసి సిబ్బందికి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బ్యాంకు జాయింట్ మేనేజర్ వి.వాసు, క్రెడిట్ ఆఫీసర్ ధ్రువకుమార్‌రెడ్డి, సిబ్బంది నేరయ్య, బంగారి, డి.రవికుమార్, యానిమేటర్లు, డ్వాక్రా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం


లక్ష్మణ్‌రావుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పీఎంపీలు

గోకవరం: గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పీఎంపీకి కమ్యూనిటీ పారామెడికల్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన పీఎంపీ పేరాబత్తుల లక్ష్మణ్‌రావు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న తోటి పీఎంపీ సభ్యులు రూ.20,500 నగదును గురువారం జిల్లా కో కన్వీనర్ బళ్ల శ్రీనివాస్‌రావు, మండల గౌరవాధ్యక్షుడు పి.చిన్ని చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి వై.పవన్‌కుమార్, జి.వెంకటేష్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశ్రీ పురస్కారానికి అనూష యాదవ్ ఎంపిక


కళాశ్రీ ఫౌండేషన్ చైర్మన్‌ను కలిసిన అనూష యాదవ్

ప్రత్తిపాడు రూరల్: కళాశ్రీ జాతీయ పురస్కారానికి మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన అనూష యాదవ్‌ను ఎంపిక చేసినట్లు కళాశ్రీ ఫౌండేషన్ చైర్మన్, సినీ నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 15న గుంటూరులో ఆమెకు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్న లక్ష్మీనారాయణను గురువారం పిఠాపురంలో అనూష యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశ్రీ ఫౌండేషన్ ఏటా దేశ వ్యాప్తంగా పలు రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించే తెలుగు వారిని గుర్తించి వారికి కళాశ్రీ జాతీయ పురస్కారాన్ని అందజేస్తుంది. తాను చేసిన సేవలను గుర్తించి కళాశ్రీ పురస్కారానికి ఎంపిక చేసిన కళాశ్రీ ఫౌండేషన్‌కు అనూషయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కళాశ్రీ పురస్కారానికి ఎంపికైన అనూష యాదవ్‌కు పలువురు నాయకులు అభినందించారు.

వీఆర్ఏల ధర్నా

ప్రత్తిపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. డీఏతో కూడిన వేతనాలు చెల్లించాలని, వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు, జనసేన పార్టీ నాయకుడు దాసం శేషారావు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను వీఆర్ఏల ఆందోళనకు మద్దతు తెలిపారు.

వీఆర్ఏల దీక్షలు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పట్టణంలో గురువారం వీఆర్ఏలు దీక్ష చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు దాదాసాహెబ్, పిరమేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఎస్.తిమ్మాపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ తోట రవి


రౌతులపూడిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు చినదివాణం


హెచ్.కొత్తూరులో లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు


ఏలేశ్వరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- గ్రామాల్లో ఉత్సాహంగా 'జగనన్న సురక్ష'

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని రాచపల్లిలో గురువారం వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామంలోని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని అర్హులందరికీ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తహసీల్దార్ పీవీవీ గోపాల కృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, హౌసింగ్ ఏఈ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ కమిషనర్ కొండలరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని లబ్ధిదారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ కె. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సామంతుల హైమావతి, దోకిషోర్, అలమండ చలమయ్య పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు ఎంపీపీ, ప్రజాప్రతినిధులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి బులిరామకృష్ణ, పినిశెట్టి ప్రకాష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


రాచపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

సురక్షతో ప్రజల వద్దకే పాలన

రౌతులపూడి: ప్రజల వద్దకే పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. రౌతులపూడి-2 సచివాలయం వద్ద గురువారం ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జునమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

తుని: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 29, 30 వార్డులకు సంబంధించి గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు చైర్‌పర్సన్ సుధారాణి ధ్రువ పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని గౌరంపేటలో గురువారం సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు ఎంపీపీ పర్వత రాజబాబు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఇంటికే పథకాలు

కిర్లంపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ఎంపీపీ తోట రవి తెలిపారు. ఎస్.తిమ్మాపురంలో సర్పంచ్ మండేటి వీరలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

గోకవరం: గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 1, 2 సచివాలయాల పరిధిలో 2,929 మంది లబ్ధిదారులకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

531 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

జగ్గంపేట: మండలంలోని మర్రిపాకలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 531 మంది లబ్ధిదారులకు రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వసంతకుమార్, తహసీల్దార్ శ్రీదేవి పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని ఎస్సార్‌పేటలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్పంచ్ రుత్తల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమిల్లి గోవిందు సర్టిఫికెట్లు అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 218 దరఖాస్తులను పరిష్కరించామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.

అందరికీ సంక్షేమ పథకాలు

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరుతాయని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని హెచ్.కొత్తూరులో సర్పంచ్ సుబ్బారావు అధ్యక్షతన గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రాము, వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ తదితరులు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, ఎంపీటీసీ కట్టమూరి చిన్న, నాయకులు ములికి పెద్దిరాజు, చిటికెల వరహాలబాబు, పురుషోత్తం రాఘవ పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో మేలు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు పూర్తి స్థాయిలో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఆయన స్వగ్రామమైన శంఖవరంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్షలో భాగంగా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను నిర్దిష్ట సమయంలో అందిస్తున్నట్టు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలను గత ప్రభుత్వాలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు నిర్దిష్ట సమయంలో పూర్తి చేసి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 15,004 సచివాలయాలకు 10,700 సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహించారన్నారు. ఈ శిబిరాల్లో 27 లక్షల (27,32,866) ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 24 లక్షల (24,46,599) ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3,159 ఓబీసీ సర్టిఫికెట్లు, 5,199 ఫ్యామిలీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు వివరించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్‌లతో విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్‌వీ విజయ్‌ప్రకాష్ సూచించారు. స్థానిక శ్రీప్రకాష్‌లో గురువారం స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్ ప్రమాణస్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌ప్రకాష్ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో ఎవరికీ జవాబుదారీగా ఉండనవసరం లేదన్నారు. నిజాయితీగా ఉంటూ మంచి మార్గంలో పయనిస్తే అందరి మన్ననలను పొందవచ్చునన్నారు. అనంతరం స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్‌లతో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి ప్రతిజ్ఞ చేయించారు. స్కూల్ హెచ్‌ఎం బి.సీతారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శరభవరంలో గడప గడపకూ..

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని శరభవరంలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అమరాధి కాశీ, వైఎస్సార్ సీపీ నాయకులు రంగనాథం అబ్బాయి, రామిశెట్టి దొరబాబు, అటికే సత్యనారాయణ, బర్రె రాజబాబు, బర్రె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శరభవరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తొండంగి: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని, వైద్యాధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులను ఎదుర్కోవాలని ఎంపీపీ దడాల సువర్ణలత అన్నారు. మండలంలోని ఏవీ నగరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల నివారణకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ పి.రవికుమార్, పి.భారతి తదితరులు ఎంపీపీ సువర్ణలతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రావికంపాడు, పెరుమాళ్లపురం, తొండంగి పీహెచ్‌సీల అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సువర్ణలత

అభివృద్ధి పనులకు భూమిపూజ


తుని 29వ వార్డులో అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 29, 30 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. సాయినగర్ ప్రాంతంలో కాలువలు, మార్కండ్రాజుపేటలో కల్వర్టులు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువచ్చిన కౌన్సిలర్లను అభినందించారు. దశల వారీగా అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు దోనపర్తి రాజేశ్వరి, సిద్దిరెడ్డి గౌరి వనజ, కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

పార్టీ నేతలతో త్వరలో మిథున్‌రెడ్డి సమావేశం

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గ నేతలతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ పరిశీలకులు, ఎంపీ మిథున్‌రెడ్డి కాకినాడలో త్వరలో సమావేశం అవుతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తెలిపారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన అంశాలను ఇటీవల గన్నవరంలో మిథున్ రెడ్డిని కలిసి వివరించామన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ కాకినాడలో నేతలందరితో సమావేశం నిర్వహిస్తామని చెప్పారన్నారు. ఈ సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

సేవాభావంతో అడుగులేస్తూ..

కోటనందూరు మండలం కొత్తకొట్టాం గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ కోనాల రాజశేఖర్ (అనిల్)సేవాభావంతో అడుగులేస్తున్నాడు. తన పరిధిలోని 50 కుటుంబాలతో మమేకమై సేవలందిస్తున్నాడు. ఎటువంటి ఆధారం లేని వృద్ధులు, వితంతువులకు అన్ని తానై ప్రభుత్వ పథకాలు వర్తించేలా చేస్తున్నాడు. తన పరిధిలోని 63 ఏళ్ల సలాది నాగాయమ్మకు అన్నీ తానై వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, రైతుభరోసా పథకాలను ఇప్పించాడు. తను సంపాదిస్తున్న కొద్దిమొత్తంలో కొంత వెచ్చించి గ్రామంలో చిన్నారులకు పలకలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు సైతం చేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.


కొత్తకొట్టాంలో నాగాయమ్మకు పింఛను అందిస్తున్న వలంటీరు అనిల్

సొంత కొడుకులా సేవలు



"వయస్సు మీరిన నాకు సొంత మనుషుల ఆధారం లేదు. మా వలంటీర్ అనిల్ సొంత కొడుకులా రోజూ ఇంటికి వచ్చి పలకరిస్తుంటాడు. ఏ పని చెప్పినా కాదనకుండా సహాయం చేస్తాడు. ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారకముందే పింఛన్ తెచ్చి ఇస్తాడు. రైతు భరోసా, ఆసరా పథకాలు వచ్చేలా చేశాడు. ఎటువంటి సంబంధం లేకపోయినా అన్ని విధాలా అండగా ఉండి సొంత మనిషిలా సేవలందిస్తున్నాడు."

– సలాది నాగాయమ్మ, పింఛనుదారు, కొత్తకొట్టాం

విస్తారంగా వర్షాలు


ఏలేశ్వరంలో రహదారిపై నిలిచిపోయిన వర్షపునీరు

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానర హదారులపై వర్షపునీరు నిలిచిపోవడంలో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. వర్షాలు పడడంతో మెట్టలో రైతులు దమ్ములు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలపడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయేల్‌కు పదవి దక్కడంపై హర్షం


ఆరుగుల మోషే

కోటనందూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్‌కు అసెంబ్లీ లెజిస్లేటివ్ ఎస్సీ కమిటీ సభ్యుడిగా పదవి దక్కడంపై మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు ఆరుగుల మోషే హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న ఇజ్రాయేల్‌కు ఎమ్మెల్సీతో పాటు అత్యున్నత లెజిస్లేటివ్ కమిటీలో చేర్చడం సీఎం జగన్‌కే చెల్లిందన్నారు. సీఎం జగన్ తన పాలనలో దళితులకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పెద్దపీట వేశారన్నారు. దళితులు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉంటారన్నారు. దళితుల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు ఇజ్రాయేల్ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితా తయారీనే లక్ష్యం

- కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్ఓ సుధారాణి
- నేటి నుంచి ఇంటింటా సర్వే

కిర్లంపూడి: కచ్చితమైన ఓటరు జాబితా తయారీనే లక్ష్యంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) వి.సుధారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కేవీ మాధవరావు అధ్యక్షతన బీఎల్ఓలతో ఓటరు జాబితా తయారీపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ సుధారాణి మాట్లాడుతూ శుక్రవారం నుంచి వచ్చే నెల 21 వరకూ బీఎల్ఓలు గ్రామాల్లోకి ఇంటింటా సమగ్ర సర్వే చేస్తారన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా చేర్చాలని సూచించారు. ఓటరు జాబితా తయారీలో తప్పులు దొర్లితే బీఎల్ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డీఐలు, ఏఎస్ఓలు, జూనియర్ అసిస్టెంట్‌లు, పలువురు సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సుబ్బలక్ష్మి

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి

ప్రత్తిపాడు: పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ప్రత్తిపాడు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం నియోజకవర్గ ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా ఓటరు సర్వే చేస్తారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు గ్రామాల్లో ట్రాన్స్ జెండర్స్ ఉంటే వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాల్సిన బాధ్యత బీఎల్ఓలదే అన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల పూర్తయిన వారందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలని సూచించారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి.చిన్నారావు, కె.సుబ్రహ్మణ్యం, జి.భీమారావు, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కేపీ కొండలరావు, లంపకలోవ సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, టీడీపీ మండలాధ్యక్షుడు అమరాది వెంకటరావు, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, జనసేన నాయకుడు దాసం శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీపై శుక్రవారం నుంచి ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చిన్నారావు గురువారం తెలిపారు. గ్రామాల వారీగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి కొత్తఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై సమాచారం సేకరిస్తారని తెలిపారు.

విపక్షాల కూటమికి ఇండియా పేరు రద్దు చేయాలి

ప్రత్తిపాడు: దేశంలోని విపక్షాల కూటమికి 'ఇండియా' పేరును రద్దు చేయాలని కోరుతూ ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విపక్షాల కూటమికి ఇండియాగా నామకరణం చేసిన వారిపై జాతీయ చిహ్నాల చట్టం సెక్షన్ 1, 2, 3 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

రోగులకు పాదరక్షల పంపిణీ

గండేపల్లి: వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ, అభిమానంతో ఉండాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుష్టు వ్యాధిగ్రస్తులకు గురువారం ఆయన చెప్పులు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ పంపిణీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచ్ రుత్తల లలిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంటిమామిడి, అన్నయ్యపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని తొండంగి, కృష్ణాపురం, పి.అగ్రహారం, ఒంటిమామిడి, దానవాయిపేట, పెరుమాళ్లపురం, ఎల్లయ్యపేట, జీఎం పేట, వేమవరం, ఆనూరు తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.